కమ్మేసిన గుర్రపుడెక్క..!

● నిజాంపేట్ మున్సిపల్‌లో అధ్వానంగా చెరువులు ● నేరుగా డ్రైనేజీ నీరు కలుస్తున్న వైనం
● చనిపోతున్న చేపలు, విజృంభిస్తున్న దోమలు ● ఇబ్బందుల్లో స్థానికులు, పట్టించుకోని అధికారులు


బాచుపల్లి పత్తికుంట చెరువులో పరుచుకున్న గుర్రపు డెక్క

నిజాంపేట్ : ఒకప్పుడు నీటితో కళకళలాడిన చెరువులు.. ప్రస్తుతం గుర్రపుడెక్క కమ్మేయడంతో కంటికి నీరు కనిపించకుండా పోతోంది. చెరువులు, కుంటలను పర్యాటక కేంద్రాలుగా మారుస్తామన్నా ప్రజాప్రతినిధుల మాటలు నీటి మూటాలుగానే మిగిలిపోతున్నాయి. ప్రగతినగర్‌లోని అంబీర్ చెరువు నిజాంపేట్ మున్సిపల్, జీహెచ్ఎంసీకి, నిజాంపేట్‌లోని తుర్క చెరువు బాచుపల్లి ప్రాంతానికి అనుకుని ఉంది. బాచుపల్లిలోని బైరుని చెరువు, పత్తికుంట, మేడికుంట లాంటి చెరువులు నిరుపయోగంగా మారిపోతున్నాయి.వీటి సంరక్షణ, అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చెరువుల ఉనికే ప్రశ్నార్థకంగా మారుతున్నది.

చెరువుల్లో డ్రైనేజీ నీరు..

◆ అంబీర్ చెరువు, తుర్క, బైరుని, పత్తికుంట, మేడికుంట, పాపయ్యకుంట లాంటి చెరువులన్నీ డ్రైనేజీ నీటితో నిండిపోయాయి. జనాభాతో పాటు నివాసాలు పెరగడంతో డ్రైనేజీ నీరంతా ఆయా ప్రాంతాల్లో ఉన్న చెరువుల్లోకి చేరుతున్నది. ప్రత్యేక పైపులైన్లు వేసి డ్రైనేజీ నీరు చెరువుల్లో కలవకుండా చూడాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. ఇటీవల బాచుపల్లిలోని పత్తికుంట చెరువులోకి పక్కనే ఉన్న ప్రైవేట్ కాలేజీలు, స్కూల్స్, వ్యాపార సముదాయాల నుంచి డ్రైనేజీ నీటిని వదలడంతో గత నెల 28న చెరువులోని చేపలన్నీ మృతి చెందాయి. ఈ విషయమూ ముదిరాజు సంఘం వారు జిల్లా కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేశారు.

దోమలతో బెంబేలు..

◆ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చెరువుల్లో ఏపుగా గుర్రపు డెక్క పెరగడంతో దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు, బస్తీల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే పలువురు రోగాల బారిన పడి ఆసుపత్రుల పాలయ్యారు. అయినా అధికారులు బస్తీల్లో ఎమర్జెన్సీ ఆరోగ్య శిబిరాలు కూడా ఏర్పాటు చేయడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పేరుకే పర్యాటక ప్రాంతాలు..

◆ నిజాంపేట్‌లోని చెరువులను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని గత ప్రభుత్వం నుంచి హామీలు ఇస్తూనే ఉన్నారు. ప్రగతినగర్‌లోని అంబీర్ చెరువును నాటి మంత్రి కేటీఆర్ సైతం సందర్శించి మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చుదాం అని అన్నారు. కానీ ఇప్పటి వరకు అమలు కాలేదు. ఇక మిగత చెరువులను సైతం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పర్యాటక కేంద్రాలుగా మారుస్తామని, వాటిని ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తే అనేక ప్రయోజనాలు ఉంటాయని పేర్కొన్నారు. అయితే కార్పొరేషన్‌లో నిధుల కొరతతో పనులు ముందుగు సాగడం లేదనే ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెరువులను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.


ప్రగతినగర్‌లోని అంబీర్ చెరువు..


నిజాంపేట్‌లోని తుర్క చెరువులో..


పత్తికుంటలో చనిపోయిన చేపలు (ఫైల్)

ముమ్మరంగా నాలా పనులు


గణేశ్‌నగర్ నాలా వద్ద జరుగుతున్న పనులు

జగద్గిరిగుట్ట: చింతల్, గణేశ్‌నగర్‌లో 1 కోటి 80 లక్షలతో చేపట్టిన నాలా పనులు ముమ్మరంగా సాగుగుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గాల్లో పాదాచారులు, స్థానికులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. మూడు నెలల్లోగా పనులు పూర్తి చేస్తామని ఏఈ మల్లారెడ్డి తెలిపారు.

మర్యాదపూర్వక కలయిక


శ్రీకాంత్ గౌడ్‌తో సమీర్‌ఖాన్

జగద్గిరిగుట్ట: మెహదీపట్నంలోని తెలుగు సమావేశం భవన్‌లో తెలంగాణ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్‌ను శనివారం నాయకులు కలిశారు. టీపీసీసీ మైనార్టీ డిపార్ట్‌మెంట్ స్టేట్ జాయింట్ కన్వీనర్ సమీర్‌ఖాన్‌తో పాటు పలువురు మైనార్టీ నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అధికారుల తీరుపై వినూత్న నిరసన


దండం పెడుతూ నిరసన తెలుపుతున్న యువకులు

సుభాష్‌నగర్: కొంపల్లి మున్సిపల్‌లోని దూలపల్లి 14వ వార్డు యువకులు శనివారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. దూలపల్లి ప్రధాన రోడ్డు నుంచి 120 గజాలు వెళ్లే దారిలోని డ్రైనేజీ మ్యాన్‌హోల్ కొన్నేళ్లుగా పొంగిపొర్లుతున్నది. ఈ విషయమై అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని, విసుగు చెందిన వారు మ్యాన్‌హోల్ వద్ద దండం పెడుతూ నిరసన తెలిపారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని లేకుంటే మున్సిపల్ కార్యాలయంలో వంటవార్పు చేస్తామని స్థానికులు హెచ్చరించారు.

సత్యవాణి హైస్కూల్‌లో ‘స్టూడెంట్స్ ఓరియెంటేషన్’


మాట్లాడుతున్న కీరో పబ్లిషర్స్ మేనేజర్ హేమావతి

జీడిమెట్ల: ఎస్ఆర్‌నాయక్‌నగర్‌లోని సత్యవాణి హైస్కూల్‌లో శనివారం స్టూడెంట్స్ ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కీరో పబ్లిషర్స్ ట్రైనింగ్ మేనేజర్ శ్రీమతి హేమావతి హాజరై మాట్లాడారు. విద్యార్థులు టీచర్స్ గైడ్ లైన్స్ పాటిస్తే సులువుగా పాఠాలను అర్థం చేసుకోవచ్చని సూచించారు. టీవీఆర్ పాఠశాలల చైర్మన్ కోటిరెడ్డి మాట్లాడుతూ మారుతున్న కాలనుగుణంగా ప్రాజెక్ట్ పద్ధతిలో బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

తవ్వి.. వదిలేశారు..!



జీడిమెట్ల: సుభాష్‌నగర్ డివిజన్ ఎస్ఆర్‌నాయక్‌నగర్‌లో సీసీ రోడ్డు వేసేందుకు కాంట్రాక్టర్ 12 రోజుల క్రితం రోడ్డును తవ్వాడు. అయితే ఇప్పటికీ రోడ్డు వేయకపోవడంతో కాలనీవాసులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా కాంట్రాక్టర్ స్పందించి సీసీ రోడ్డు త్వరగా వేయాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

మురుగు సమస్యను పరిష్కరించండి


గండిమైసమ్మ- డీపోచంపల్లి రోడ్డుపై పారుతున్న డ్రైనేజీ నీరు

దుండిగల్: మురుగు సమస్యను పరిష్కరించాలని దుండిగల్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు ఆనబోయిన మల్లేశ్‌యాదవ్ కోరారు. గండిమైసమ్మ నుండి డీపోచంపల్లికి వెళ్లే రహదారిలో లీకవుతున్న డ్రైనేజీ నీటిని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలలే క్రితమే సమస్యను మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లినా స్పందన లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి


ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు సమస్యను విన్నవిస్తున్న దృశ్యం

కుత్బుల్లాపూర్: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నానని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. శంభీపూర్‌లోని కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన పలు సంక్షేమ సంఘాల ప్రతినిధులు శనివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. తమ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాలు అందజేశారు. దీనిపై స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


ఎమ్మెల్యే వివేకానంద్‌ను కలిసిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో వివిధ బస్తీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. గాజులరామారం డివిజన్ శిరిడి హిల్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రమేశ్ స్థానికంగా సీసీ రోడ్లు, వీధి దీపాలు, డ్రైనేజీ మరమ్మతులు చేపట్టాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే పనులు 90 శాతం పూర్తయ్యాయని, మిగిలిన వాటిని త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటానన్నారు. సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు బ్రహ్మరెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్యబాబు, సంయుక్త కార్యదర్శి వేణుగోపాలా చారి, కోశాధికారి బాలకిషన్‌ల ఉన్నారు. అదేవిధంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి పరిధిలోని కావ్య ఎవెన్యూ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి కాలనీలో భూగర్భ డ్రైనేజీ, నూతనంగా రోడ్డు వేయాలని కోరారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో పనులు నిలిచిపోయాయని, కొత్త పనులకు ప్రణాళికలు రూపొందించి ప్రారంభిస్తామని ఎమ్మెల్యే వారికి హామీనిచ్చారు. కాలనీ విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ప్రసన్న బాబు, కోశాధికారి రామకృష్ణ, సభ్యులు ప్రసాద్, శ్రీకాంత్,వీఎస్ చారి ఉన్నారు.

ఒంటికి..రెంటికి ఇబ్బందే..!


సంజయ్‌గాంధీనగర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో టాయిలెట్లు


ప్రధాన డ్రైనేజీలైన్‌కు కలపకుండా వదిలేసిన దృశ్యం

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ సంజయ్ గాంధీనగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు ఉన్నప్పటికీ వాటి పైపులైన్ ఔట్‌లెట్ కనెక్షన్‌ను డ్రైనేజీ లైన్‌కు కలపకుండా వదిలేశారు. దీంతో టాయిలెట్ల నుంచి మురుగు నీరు నేరుగా బస్తీలోని రోడ్డుపైకి వస్తున్నది. ఈ విషయాన్ని బస్తీ నాయకులు ప్రధానోపాధ్యాయుడు దృష్టికి తీసుకెళ్లడంతో అప్పటి నుంచి టాయిలెట్లను వినియోగించడం లేదు. దీంతో విద్యార్థులు ఒంటికి.. రెంటికి ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి


విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఉప కమిషనర్ నరసింహ

కుత్బుల్లాపూర్: ఇండ్ల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ నరసింహ అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంటమాలజీ అధికారి ఉమారాణితో కలిసి మాట్లాడుతూ ఇండ్ల పరిసరాల్లోని కుండీలు, బహిరంగ ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. లేకుంటే దోమలు వృద్ధి చెంది తద్వారా వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం ఇండ్ల పరిసరాలు శుభ్రంగా ఉంచుతామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఇన్‌స్పెక్టర్ గిరిబాబు, శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్లు రవి ,శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు హోల్ నుంచి పొగలు


సీసీరోడ్డు హోల్ నుంచి పొగ వస్తున్న ప్రదేశాన్ని పరిశీలిస్తున్న విద్యుత్ సిబ్బంది


మ్యాన్‌హోల్‌ను శుభ్రం చేసిన జీహెచ్ఎంసీ సిబ్బంది

సుభాష్‌నగర్: సూరారం డివిజన్ శివాలయనగర్ నందినగర్‌లోని ట్రాన్స్‌ఫర్ పక్కనున్న సీసీ రోడ్డు హోల్ నుంచి శుక్రవారం రాత్రి పొగలు రావడంతో స్థానికులు భయందోళనకు గురయ్యారు. గ్యాస్ పైప్‌లైన్ లీకై ఉంటుందని భావించిన ప్రజలు శనివారం సూరారం పోలీసులకు సమాచారం అందించారు. వారి సమాచారం మేరకు భాగ్యనగర్ గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి గ్యాస్ లీకేజీ కాదని నిర్ధారించారు. దీంతో జీహెచ్ఎంసీ అధికారులు మ్యాన్‌హోళ్లను శుభ్రం చేయించారు. చివరకు విద్యుత్ ఏఈ కృష్ణ ఆధ్వర్యంలో క్షుణ్ణంగా పరిశీలించగా గతంలో సీసీ రోడ్డు వేసేటప్పుడు అండర్‌గ్రౌండ్ వైర్‌పై బరువు పడడం వల్ల ఈ సమస్య తలెత్తిందని గుర్తించారు. అనంతరం మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



సుభాష్‌నగర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం సాయిపూజా థియేటర్ సమీపంలోని హేవెన్–18 రెస్టారెంట్ గేటు పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉందని సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. శవ పంచనామా నిర్వహించి పోస్ట్‌మార్టం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అనారోగ్య సమస్యలతో చనిపోయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే డయల్ 100 లేదా 9908076799 కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవ్వాలి



సుభాష్‌నగర్: పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని దుండిగల్ మునిపల్ చైర్‌పర్సన్ కృష్ణవేణి అన్నారు. వన మహోత్సవంలో భాగంగా బహదూర్‌పల్లిలో వైస్ చైర్మన్ తుడుం పద్మారావుతో కలిసి శనివారం మొక్కలు నాటారు. అనంతరం స్థానికులకు మొక్కలు పంపిణీ చేశారు. కృష్ణవేణి మాట్లాడుతూ భవిష్యత్‌లో విస్తారంగా వర్షాలు కురవాలంటే మొక్కలు నాటాలని, అదే విధంగా వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి


యూనిఫాం స్టిచ్చింగ్ కేంద్రాన్ని ప్రారంభించిన మేయర్ నీలారెడ్డి, కార్పొరేటర్ ఆగం పాండు

నిజాంపేట్: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని నిజాంపేట్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. 16వ డివిజన్‌లోని రాజీవ్‌గాంధీనగర్‌లో వెన్నెల పొదుపు సంఘం మహిళా శక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మ ఆదర్శ ప్రభుత్వ పాఠశాల యూనిఫాం స్టిచ్చింగ్ కేంద్రాన్ని స్థానిక కార్పొరేటర్ ఆగం పాండుముదిరాజ్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళా నాయకురాలు రజితరెడ్డికి మేయర్ అభిందనలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల యూనిఫాంల కుట్టు పనిని అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలకు అప్పగించిందని, దీంతో మహిళలు ఉపాధి పొందే అవకాశం దక్కిందన్నారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు సబితారెడ్డి, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వన మహోత్సవం..

నందనవనం పార్కులో మేయర్ నీలారెడ్డి, కమిషనర్ రామకృష్ణరావు మొక్కలను నాటారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్రీరాములు, చిట్ల దివాకర్, గంగయ్యేల శ్రీనివాస్ యాదవ్, నాయకులు సురేంద్ర కుమార్ యాదవ్, సుబ్బు, యుగేందర్ రెడ్డి, మేడా శ్రీనివాస్ , భాస్కారాచారి, ఓంకార్, శివ కుమార్, వెంకట్రావు, హరితహారం విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

త్రోబాల్ పోటీల్లో ప్రతిభ


షెర్‌వుడ్ పబ్లిక్ స్కూల్‌కి చెందిన విద్యార్థినులు

జగద్గిరిగుట్ట: సీబిఎస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ 2024 రీజినల్ లెవల్ త్రోబాల్ పోటీలు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు స్టైమ్ పాఠశాలలో ఈ నెల 11న నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల నుంచి వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా అండర్–19 విభాగంలో కుత్బుల్లాపూర్, జీడిమెట్ల, షెర్‌వుడ్ పబ్లిక్ స్కూల్‌కి చెందిన విద్యార్థినులు ద్వితీయ స్థానంలో నిలిచారు. దీంతో విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించింది.

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చేరిక



నిజాంపేట్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నారని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఆ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. బాచుపల్లిలోని కార్యాలయంలో సూరారం, గాజులరామారం డివిజన్లకు చెందిన యువకులు దేవా, సాయి, రాఘవేందర్, సురేశ్, నవీన్, లక్ష్మణ్ తదితరులు శనివారం చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు తీరని అన్యాయం జరిగిందని, సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో అన్ని వర్గాల ప్రజల సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, నాయకులు ప్రవీణ్, అవిజెజేమ్స్, గణేశ్, సంతోష్ ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

‘సాక్షి’తో మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి


వెంకట్‌రెడ్డి, మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ

కుత్బుల్లాపూర్: ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించినా.. నంబర్ ప్లేట్లు లేకుండా తిరిగినా.. మద్యం వాహనాలు నడుపుతూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. ఓవైపు సుచిత్ర.. మరోవైపు మేడ్చల్, ఇంకోవైపు అల్వాల్.. అటు జాతీయ రహదారి ఇటు నేషనల్ హైవేకు అనుసంధానంగా ఉన్న ప్రాంతాల్లో వీఐపీ రాకపోకలతో పాటు వివిధ విద్యాసంస్థలు అధికంగా ఉన్న ఈ ప్రాంతం పై ట్రాఫిక్ నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను ఆయన ‘సాక్షి’ కి వెల్లడించారు.

◆ ప్రజల సమయాన్ని వృథా చేయకుండా కార్యాలయాలు, పరిశ్రమలు, విద్యాలయాలకు వెళ్లే సమయాల్లో రద్దీ అధికంగా ఉండే ప్రాంతాలను గుర్తించి అక్కడ ట్రాఫిక్ సమస్య లేకుండా కట్టడి చేస్తూ ముందుకు సాగుతున్నాం.

◆ ముఖ్యంగా వివిధ ప్రధాన కూడళ్ల వద్ద యూటర్న్ ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య 80 శాతం అధిగమించినట్లయ్యింది. ప్రతి జంక్షన్ వద్ద ఈ సమస్య ఓ కొలిక్కి వచ్చింది.

◆ గతేడాది కంటే ఈ ఏడాది ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గాయి. గతంలో 25 ప్రమాదాలు జరగగా, ఇప్పుడు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో 18 మాత్రమే జరిగాయి. రానున్న రోజుల్లో మరిన్ని పకడ్బందీ చర్యలు తీసుకుంటాం.

◆ వర్షం పడ్డ ప్రతిసారి ప్రధాన రోడ్లన్నీ ట్రాఫిక్ జామ్ అవుతున్న నేపథ్యంలో వాటిపై ప్రత్యేక దృష్టి సారించినం. గ్రేటర్ అధికారుల సహాయంతో అటు అల్వాల్, ఇటు కుత్బుల్లాపూర్ సర్కిల్ ఇంజినీరింగ్ అధికారుల సహకారంతో ఐదు ప్రధాన ప్రాంతాలను గుర్తించినం. దీనికి ప్రణాళిక రూపొందించి కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీల పనులు కూడా ప్రారంభం కావడం సంతోషంగా ఉంది. రానున్న రోజుల్లో వర్షం పడినా వాహనాలు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపడుతున్నాం.

◆ జీడిమెట్ల గ్రాంధీ విగ్రహం వద్ద, కొంపల్లి ఎస్ఎస్ఆర్ గార్డెన్ సమీపంలో, అల్వాల్ వెంకటాపూర్, జ్యోతినగర్, లయోలా కాలేజీ బస్టాప్ సమీపంలో వర్షపు నీరు చేరడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉండేది. ఈ ప్రాంతల్లో డ్రైనేజీల పనులు పూర్తయితే ఇక తట్రాఫిక్ సమస్య ఉండదు.

◆ ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికే మల్లారెడ్డి కాలేజీ, సీఎంఆర్, ఎన్‌సీసీ, ఆటో డ్రైవర్లు, ప్రైవేట్ వాహన డ్రైవర్లతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న సమయంలో క్రమ పద్ధతిలో వెళ్తే ఎలాంటి ఇబ్బందులు ఉండయని వివరిస్తున్నాం.

◆ ఇటీవల మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ పరిధిలో ప్రత్యేకంగా రాంగ్ రూట్, నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సుమారు 80 కేసులు నమోదు చేశాం. వారిపై క్రిమినల్ కేసులు బీఎస్ఎస్ (125), 184 డేంజరస్ ర్యాష్ సెక్షన్ కింద, 119, 179 రూల్స్‌కు విరుద్ధంగా నెంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న వారిపై కేసులు నమోదు చేసినం.

◆ మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడితే వారికి ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇస్తున్నాం. మళ్లీ పట్టుబడితే వారిపై నూతన యాక్ట్ ప్రకారం చర్యలు తీసకుంటున్నాం. ఆయా ప్రాంతాల్లో ప్రతిరోజు డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం.